

# జీవనగంగ

శారదా అశోకవర్ధన్



ఉమ మంచం మీద పడుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది. తృప్తిగా ఏడుస్తోంది. తనివితీరా ఏడుస్తోంది. చుట్టూ తిట్టే వారు లేరు. ఊరుకోబెట్టి ఓదార్చే వారూ లేరు. అందుకే మనసారా ఏడ్చింది. కాస్సేపటికి గుండె తేలిక పడింది. మెల్లగా లేచి బాత్‌రూం డోర్ తెరచి సింక్ దగ్గరకి వెళ్లి చల్లటినీళ్లతో మొహం కడుక్కుంది. కళ్లు ఎర్ర గన్నేరుల్లా వున్నాయి. పచ్చటి బుగ్గలు ఎర్ర మందారాలయ్యాయి. తువ్వాలుతో మొహం తుడుచుకుంది. ఎంత కాదనుకున్నా మనసు ఆలోచించడం మానడంలేదు. ఎప్పుడూ పాడుకునే కీర్తన ''ఏలా ... నీ దయ రాదూ....? నాపై ... ఏలా...'' మనసులోనే పాడుకుంది.




ఎన్నిసార్లు పాడుకుందో! వెంటనే భాగవతంలోని పోతనగారి పద్యం జ్ఞాపకం వచ్చింది. ''కలడు కలండనువాడు కలడో ... లేడో'' అని! వుంటే తన పాట వినలేదా? విన్నా దయ రాలేదా? అనుకోగానే నవ్వొచ్చింది అంత బాధలోనూ! తనేమైనా మీరాబాయా, సక్కుబాయా? అంతలోనే మళ్లీ గతం, ఆలోచనల్లోకి చటుక్కున లాగేస్తోంది. ఈ కీర్తన తన అయిదవ ఏటే... గురువుగారు రాఘవాచారిగారితోబాటూ పాడితే '' ఏలా... నీ దయ ... రాదూ...'' అంటూ, జనంలోంచి వెల్లివిరిసిన కరతాళ ధ్వనులు, ప్రశంసల జల్లులూ, ఇప్పటికీ జ్ఞాపకమున్నాయి. '' ఈ అమ్మాయికి సంగీతం సరస్వతీదేవి కటాక్షం'' అన్నారు.''కోకిల కంఠం'' అన్నారింకోరు.

ఇలా ఎన్నెన్నో పొగడ్తలు. ఆనాడు వీటి అర్థాలు తెలీక పోయినా ఏదో పులకింత! తెలియని ఆనందం!

ఆ తరువాత పదిహేనేళ్లు వొచ్చాయో లేదో, గురువుగారితోపాటూ కచ్చేరీలలో ఒకటో రెండో పాటలు పాడటం, కొన్నాళ్లకి ప్రఖ్యాత నృత్యకళాకారిణి శ్రీమతి మాలతీ సుందరేశన్ నాట్యానికి తన గాత్రాన్నందించడం జరిగి పోయింది. మాలతి గారితో ఎన్ని ప్రోగ్రామ్స్‌కి వెళ్లిందో! ఆబాటే తనని నడిపించుకుంటూ, సంగీత, నృత్య కళాశాల దాకా తీసికెళ్లి సంగీత విభాగంలో ఉద్యోగాన్నిప్పించింది. మాలతీ సుందరేశన్ ప్రదర్శనకొచ్చిన వాళ్లంతా, 'భామనే... సత్య భామనే' అనే పాట పాడుతున్నా, 'పలుకు తేనెలతల్లి పవళించెనె' అని తమాషాగా అనేవారు.

కార్యక్రమాలపైన వచ్చే సంపాదనా, కళాశాలలోని నెలసరి జీతం అంతా తండ్రి చేతిలో పోసేది. ఆ డబ్బులతో అందరి అవరరాలూ తీరేవి. చెల్లెలికి బట్టలూ, పుస్తకాలూ, తమ్ముళ్లకి పెన్నులూ, పెన్సిళ్లూ, ఇంట్లోకి సరుకులూ! తండ్రికి సిగరెట్లూ, తల్లికి రకరకాల నోములూ, వ్రతాల ఖర్చులూ అన్నీను. తనకి మాత్రం ఒక్కచీర కొనుక్కోవాలన్నా, సినిమాకెళ్లాలన్నా అమ్మనడగాలి. అమ్మ నాన్ననడగాలి. నాన్న సరేననాలి. ''బోలెడు చీరలున్నాయిగా, మళ్లీ ఎందుకూ?'' అంటే ఇంక అంతే! మాలతీ సుందరేశన్ ప్రోగ్రామ్ వుందని కబురు పెడితే, తనకి జ్వరమొచ్చినా సరే, వెళ్లమనేవారు కానీ, పోనీ రెస్ట్ తీసుకో, ప్రోగ్రాం పోతే పోయింది అనేవారు కాదు. అదంతా తన సంగీతం పట్ల వాళ్లకున్న శ్రద్ధే అనుకుంది తను. అలా ఓ దశాబ్దం గడిచి పోయింది. ఉమకి పాతికేళ్లు నిండాయి. ఏ పెళ్లి సంబంధమొచ్చినా, పిల్లాడు నల్లగా జీడిలా వున్నాడనో, పొట్టిగా పిట్టలా వున్నాడనో, సన్నగా బద్దలా వున్నాడనో, లావుగా డ్రమ్ములా వున్నాడనో వంకలు పెట్టేసి మాట్లాడకుండా ఊరుకునేవారు. ఎవరైనా అడిగితే ''మా ఉమకేం? బంగారు బొమ్మ! బుద్ధిలో బృహస్పతీ... సంగీతంలో సరస్వతీ... దానికి బంగారంలాంటి మొగుడు వెతుక్కుంటూ వొచ్చి స్వయంవరంలో ఎగరేసుకుపోతాడు'' అనేది తల్లి.

> ఇన్నేళ్లూ ఇంత సంపాదించినా ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టలేని నిస్సహాయత, డబ్బు మీదే తప్ప, తనమీద ప్రేమలేని తన కన్నవాళ్ల ప్రేమ మీద అసహ్యం పుట్టింది ఉమకి.

''అదీ బంగారు పిచ్చుక! అందర్నీ ఆకర్షిస్తుంది. మనకి తగిన వాళ్లెవరో మనం తెలుసుకోవాలిగా!' అనేవాడు తండ్రి. నిజంగా వాళ్లు అటువంటి గంధర్వుడి కోసమే ఎదురు చూస్తున్నారనుకునేది పాటల సుందరి ఉమ. అసలు పెళ్లి విషయం పెళ్లి చేసేస్తే, ఆమెకి ముప్పై ఏళ్లు దాటిపోయాయి. చెల్లి ఉషా సుమిత్ర. తన క్లాస్‌మేట్ రమేష్ చంద్రతో ప్రేమ సంగతి ఇంట్లో చెప్పేసరికి ఉలిక్కిపడ్డారు సుందరమ్మా కేశవరావులు. దానికితోడు ఉద్యోగస్తుడైన మధూకి మంచి వరకట్నంతో సంపాదించే పిల్లల సంబంధాలూ వొస్తూ వుండడంతో ఉమవాళ్లకొక తలనొప్పిగా తయారైంది. ఎవళ్లకో ఒకళ్లకి ముడిపెట్టేయాలనుకున్నారు కేశవరావుగారు. భార్యపోయి ఒక బిడ్డకి తండ్రైన శ్రీరాం కట్నం లేకుండా ఉమని చేసుకోవడానికి ఒప్పుకున్నందుకు పొంగిపోయారు సుందరమ్మా, కేశరరావు. శ్రీరాం బ్యాంక్ ఆఫ్ ఆంధ్రా, కో ఆపరేటివ్ బ్యాంకులో అసిస్టెంటు మేనేజరు. బాగానే వుంటాడు. ఉమని కోరి చేసుకుంటూ వున్నందుకు సంతోషపడింది రెండవ పెళ్లివాడని బాధపడకుండా! పెద్ద ఆర్భాటంగా కాకుండా, పెళ్లిబాగానే జరిగింది.

'మనసున మల్లెల మాలలూగెనే
కన్నుల వెన్నెల జోలలూగెనే- ఎంతహాయి
ఈ రేయినిండెనో-
ఎన్ని నాళ్లకీ బతుకు పండెనో!!' అనుకుంటూ మురిసిపోయింది.

'మనసుపాడింది సన్నాయిపాట' అని తన్మయత్వంతో ఊగిపోయింది. ఇకపై తన సంపాదనకి తనే హక్కుదారు. ఇన్నేళ్లూ ఇంత సంపాదించినా ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టలేని నిస్సహాయత, డబ్బు మీదే తప్ప, తనమీద ప్రేమలేని తన కన్నవాళ్ల ప్రేమ మీద అసహ్యం పుట్టిన ఉమ,

''ఈ పంజరపు బ్రతుకు ఇకనీకు తీరునే...'' అనుకుని ఆ రోజు సంతోషంగా ప్రయాణమయింది ఉమ, కన్నవారింటినుంచి కట్టుకున్నవారింటికి. అత్తగారూ ఆడబిడ్డలూ మరిదిగారూ పలికిన స్వాగతం ''రావమ్మ మహాలక్ష్మీ రావమ్మా'' అన్నట్లు అనిపించింది. ఆనందంతో తేలిపోయింది గాలిలోని దూదిపింజలా.

''మరి వేరే... దిక్కెవరురా'' పాడు అనేవాడు శ్రీరాం.

మైమరచి పాడేది ఉమ.

''బ్రోచే వారెవరురా... నినువినా...! వినగానే తన్మయత్వంతో పాడేది. సాక్షాత్తూ బ్రహ్మదేవుడి ముందు కూర్చుని వీణ వాయిస్తున్న సరస్వతీ దేవిలా, హృదయ వీణ మీటుతూ పాడేది. ఆ తరువాత అతడి కౌగిలిలో గువ్వలా ఒదిగిపోయేది.

''జీవితమంటే స్వర్గం!

''జీవితమంటే ఆనందాల పల్లకి!' ఇలా రకరకాల నిర్వచనాలు చెప్పుకుంది.

***

ఉమకి మూడోనెల నడుస్తోందని చెప్పింది డాక్టరు బాలాంబిక ఉమని పరీక్ష చేసి శ్రీరాంతో. శ్రీరాం మాట్లాడక పోవడం చూసి, ఆమె 'కంగ్రాచ్యులేషన్స్'' అంది ఉమవంకా, శ్రీరాం వంకా చూస్తూ.

'థాంక్యూ' అంది ఉమ ఉత్సాహంగా. శ్రీరాం కూడా అన్నాడు చిన్నగా.

డాక్టర్ బాలాంబిక మాటలు ఉమ చెవులకు అమృతగుళికల్లా వినిపించాయి. చెవులకి ఇంపుగా మనస్సుకి తియ్యగా! పారవశ్యంతో పరవశించిపో

యింది. అప్పుడే గుండెలో పాపాయికి జోలపాడుతున్నట్లనిపించింది! ఆ రాత్రి ఆనందాన్ని శ్రీరాంతో పంచుకోవాలి. '' ఊపాలి ఇద్దరూ కలిసి పాపాయికి ఉయ్యాల'' అనుకుంది. పాపం! ఆమెకేం తెలుసు, ఆ రాత్రే తన పాలిట కాళ రాత్రవుతుందని?' శ్రీరాం మాటలు వినగానే మంచం మీద పరుపులోంచి ముళ్లు మొలిచి ఒళ్లంతా గుచ్చేస్తున్నట్లయింది. నెత్తి మీద పిడుగు పడ్డట్లయింది. '' ఉమా! పిల్లలు పుడితే నీ గొంతులోని మాధుర్యం తగ్గిపోయినట్టనిపిస్తుంది. అనిపించడం కాదు దేవీ, తగ్గిపోతుంది. అందుకనీ.... అబార్షన్ చేయించేసుకుంటే, మనం ఎంచక్కా చిలకా గోరింకల్లా...'' అంటూ ఆమె మెడచుట్టూ చేతులు వేశాడు. ఆ చేతులు ఆమెకి ఉరి బిగిస్తున్న కత్తుల్లా తోచాయి...'' అబార్షన్.. అబార్షన్...'' అంతే తరువాత మాటలు వినిపించడంలేదు.

''మనిద్దరి మధ్యా మనబాబు నిఖిల్ వున్నాడుగా, వాడు బాగా చదువుకుని మంచి ఉద్యోగం చేస్తే, మనకంతకన్నా ఏం కావాలి? మన బిడ్డ మనిద్దరి వాడూ కదా! ఈ సంవత్సరం మా చెల్లెలు వసుధకి పెళ్లి చేస్తే మన బాధ్యత తీరిపోతుంది. మన కార్తీక్ అదే నీ ముద్దుల మరిది, మెడికల్ ఎంట్రన్స్ రాస్తాట్ట. వీటన్నిటికీ నీతోడు లేకుండా నా సంపాదనేం సరిపోతుంది? నీ పేరు ప్రతిష్టలు పదికాలాలపాటు నిలవాలంటే, మనకింకే బంధాలూ వద్దు. పిల్లలసలు వొద్దు. కోకిల లా నువ్వు పాడాలి. నేను విని ఆనందించాలి! మన హోదా పెరగాలి....' ఏం చెబుతున్నాడో అసలు ఉమకి అర్థం కావడం లేదు. అతని చేతుల్ని నెట్టేసి, ఒక్కసారి మంచం మీంచి లేచి నుంచుంది. కళ్లు వర్షిస్తున్నాయి. గుండె బరువెక్కింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు సెగల్లా వొస్తున్నాయి.



## రాజకీయాలు పెరిగాయి

'స్పెషల్ స్క్వాడ్' హిందీ సీరియల్‌లో లేడీ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించే కుల్‌జీత్ టీవీల్లో బాగా ఫేమస్. ఢిల్లీకి చెందిన ఈ అమ్మాయి 17 ఏళ్ళ వయసులోనే మోడలింగ్ చేసింది. స్టేట్స్‌కి వెళ్ళి సైకాలజీ చదవాలని ఆమె కోరిక. అయితే అనుకోకుండా యాక్టింగ్‌లోకి వచ్చింది. చదువుకునే రోజుల్లో స్టేజి అంటేనే విపరీతంగా భయపడే కుల్‌జీత్ ఇప్పుడు ఈజీగా నటించేస్తోంది. అయితే టీవీల్లో రాజకీయాలు ఎక్కువయ్యాయని ఆమె ఆరోపణ. దీనికి కారణం కుల్‌జీత్‌ని స్పెషల్ స్క్వాడ్ సీరియల్ నుంచి తొలగిస్తున్నారు. ఆ స్థానంలో గౌరీప్రధాన్ నటిస్తోంది.

"మా. ... నే చెప్పేది నీ మంచి కోసమే. ..." ఏదో చెప్పబోతూ వుంటే, "మాట్లాడకండి... యూ... సెల్ఫిష్... ఫెలో" అరిచింది. అనుకోని ఈ సంఘటనతో కంగుతిన్నాడు శ్రీరాం. దగ్గరకా వెళ్లబోయాడు. "నో... నో... నన్ను మోసం చేశావు. నా బిడ్డని చంపమంటావా? భ్రూణహత్య మహాపాపం కాదా? తల్లినవుతున్న సంతోషం నాలో ఒక్కరోజయినా వుంచకుండా, కడుపులోని బిడ్డని కడుపులోనే చంపెయ్యాలన్న నీ నీచమైన ఆలోచనకి నేను ఒప్పుకుంటాననుకున్నావా? మాతృత్వంలోని తీయదనాన్ని రుచి చూడకుండానే మోడులా జీవించమంటావా? అసలిలా అనడానికి నోరెలా వచ్చింది? నువ్వు మనిషివా? రాక్షసుడివా; ఉన్మాదిలా అరిచింది.

"శ్రీరాం ఏమైందిరా?" తలుపుకొట్టింది సుందరమ్మ.

శ్రీరాం తలుపు తీసి బయటకు వెళ్లిపోయి నిఖిల్ మంచం మీద పడుకున్నాడు. సుందరమ్మ కూడా ఒక్క క్షణం ఉమని ఎగాదిగా చూసి మూతి వంకర్లు తిప్పుతూ "దీని సంపాదన మీద మనం ఆధారపడి వున్నామని దీనికి పొగరురలా నాయనా! పోయిపోయి ఈ పొగరు మోతు చేతిలో పడ్డాం. డబ్బూ, పేరూ రెండూ వున్నాయని దీనిగర్వం. నీకు తెలీదు గానీ, నిఖిల్ అంటే దీనికి పరమ అసహ్యం, అదే నా భయం" భయం నటిస్తూ కోడలి మీది కసిని కనీసం మాటల్లో అయినా తీర్చుకుంది సుందరమ్మ. ఇవేవీ పట్టనట్టు, నిఖిల్ వీపు మీద చెయ్యివేసి పడుకున్నాడు శ్రీరాం. ఆ దృశ్యం చూసేసరికి ఉమకోపం రెట్టింపయింది. నీకు నీ బిడ్డ కావాలి కానీ, నాకు నా బిడ్డ వొద్దేం?' పక్కనే వున్న మంచినీళ్ల గ్లాసుని నేల మీద విసిరికొట్టింది. ఆ చప్పుడుకి ఇంటిల్లిపాదీ లేచారు. భయంగా నుంచున్న సుందరమ్మనీ, కాళికాదేవిలా కళ్లెర్రజేసి చూస్తున్న ఉమనీ ఆ గదిలోంచి వొచ్చేసి, నిఖిల్ పక్కనే పడుకున్న శ్రీరాంనీ చూస్తూ 'పిచ్చెక్కుంటుంది' అనుకుంటూ వెళ్లిపోయారు.

ఆ మాటలు వినగానే ఉమకి ఉక్రోషం, కోపం, నిస్సహాయతా ఒక్కసారిగా ఆవరించాయి. నీరసంతో కళ్లు తిరిగాయి. వెళ్లి మంచం మీద పడుకుని వెక్కివెక్కి ఏడుస్తూ, ఏ తెల్లవారుఝామునకో నిద్రలోకి జారుకుంది. కళ్లు తెరిచి చూసేసరికి భళ్లున తెల్లవారిపోయింది. నీరసంతో మంచం పట్టిన తనకి డాక్టర్ బాలాంబిక ఇంటికొచ్చి ఇంజక్షన్ చేసింది!!

కళ్లు తెరిచి చూసేసరికి నర్సింగ్‌హోంలో వుంది. తన ప్రమేయం లేకుండానే అంతా అయిపోయింది. శ్రీరాం చెయ్యిపట్టుకుని టాక్సీ ఎక్కించాడు. మెల్లగా టాక్సీ దిగాక నడిపించి మంచం మీద పడుకోబెట్టాడు. తల్లీ, చెల్లీ నాన్నా, అన్నా అందరూ చూడ్డానికొచ్చి వెళ్లారు. 'జాగ్రత్తగా వుండు. నిక్షేపం లాంటి సంసారాన్ని చేతులారా పాడుచేసుకోకు. నాకు శ్రీరాం అంతా చెప్పాడు. అయినా నీకు సంగీతమంటే అంత పిచ్చేమిటి? పిల్లలు పుడితే గొంతు పాడయిపోతుందా; ఇదేం విడ్డూరం? పాపం! శ్రీరాంకి పిల్లలంటే ఇష్టం. ఇదా నువ్వు చేసే నిర్వాకం?'' తండ్రి పెట్టే చివాట్లకి కోపం రాలేదు. ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. "శ్రీరాం తనన్న మాటలన్నీ నేనన్నట్లుగా చెప్పాడా? ఇంతక్రూరుడా?" ఆశ్చర్యం, భయం, ఆందోళనా, నిజంగానే పిచ్చెక్కినట్లయింది ఉమకి. పంజరంలో పక్షిలా విలవిల్లాడిపోయింది.

కన్నవాళ్లకీ, కట్టుకున్నవాళ్లకీ కావలసింది తన డబ్బేనా? మమకారం, అనుబంధం, అన్నీ కథలేనా?"

ఈ ప్రపంచం అంతా ఒక అడివిగా, ఈ మనుషులందరూ అందులోని క్రూరమృగాలుగా కనిపించారు ఉమకి! భయంగా అరిచింది.

"పిచ్చి" కన్‌ఫరమ్ చేశారు ఇంట్లో వాళ్లు.

"ఏదైనా సోకిందేమో! మంత్రం వేయించండి" కొందరి సలహా...

తన గుండెలో మండే మంటలు ఎవరికీ కనబడవు.

తన ఆర్తనాదాలు ఎవ్వరికీ వినబడవు.

ఒకనాడు అమ్మా, అత్తా కూడా తనలాగే చిన్నవాళ్లేకదా. వాళ్లెందుకు కన్నారు పిల్లల్ని? వాళ్ల కోరికలు తీరిపోయాయిగా! అయినా ఈ రోజుల్లో పెద్దవాళ్లలో కూడా పిల్లల సంపాదనతో బతకొచ్చుననే స్వార్థం పెరిగిందా? ఒకప్పుడు ఆడపిల్ల ఇంట్లో కాఫీ తాగడం కూడా తప్పేననుకునేవారు. ఇప్పుడో? తన స్నేహితురాళ్లు రాజేశ్వరి, సుమన, వాళ్లు ఉద్యోగాలు చేసి సంపాదిస్తున్నా, ఇంట్లోవాళ్లు పెళ్లిమాట తలపెట్టక పోయేసరికి కారణం వాళ్లు చెప్పినప్పుడు తను నమ్మలేకపోయింది. అంతా వాళ్ల ఊహేనేమో? అట్లాంటి వాళ్లుంటారా? అనుకుంది తను. కానీ, ఇప్పుడు తన తండ్రీ, తన భర్తా, పురుషాధిక్యంతో ఆడవాళ్లని ఆటబొమ్మలుగా ఆడిస్తున్న ఈ బొమ్మలాట చూస్తే, ఆటలో తనూ ఒక బలిపశువైంది కనుక నమ్మక తప్పడం లేదు" అనుకుంటూ నిట్టూర్చింది. మళ్లీ ఆమె మనసు ఆమెని ప్రశ్నించింది. "ఇలా నిట్టూరుస్తూ కూచుంటావా? మీ ఆడవాళ్లు ఇలా నిట్టూర్పులతో కన్నీళ్లతో, పస్తులతో పడుకుంటారు గనుకనే, మగవాళ్ల ఆటలు సాగుతున్నాయి. నీకూ అబలగానే బతకాలనుంది. బతికినంతకాలం చస్తూ బతుకుతూ సృష్టిలో ఆడది ఏరకంగా తక్కువయింది? ఆమెకి తెలివితేటలు లేవా? ఆత్మవిశ్వాసం లేదా; ధైర్యం చాలకనా? ఎందుకు అబల గా మిగిలిపోతోంది?"

ఉమ సమాధానాలకోసం వెతుకుతోంది.

"అవును! ఆడవాళ్లకి సహజంగా వున్న ప్రేమా, సర్దుకుపోయేతత్వం, కరుణా, ఆమెకి శత్రువులుగా మిగిలాయి. అవే ఆమె ప్రాణాలు తీస్తాయి. కాల్చేసి బూడిదగా మార్చేస్తాయి"

ఉమ ఉలిక్కిపడింది. "నో! అలా జరగడానికి వీల్లేదు. ఈ పరిస్థితి మారాలి. ఆడవాళ్లు అడివిలోని మానులు కారు. వాళ్లకీ మనసుంది. వాళ్లూ ఆలోచించ గలరు" తృప్తిగా ఊపిరి పీల్చుకుంది సమాధానం దొరకడంతో.

***

శ్రీరామ్‌తో తెగతెంపులు చేసుకున్న ఉమ వొంటరిది కాదు. తన లాయర్ ఫ్రెండ్ జగదీశ్వరి సహాయంతో అనాథాశ్రమం నుంచి తెచ్చుకున్న శరణ్య, లావణ్య ఇద్దరూ ఆమెకి రెండు కళ్లు! తన గాత్రాన్ని వాళ్ల గొంతులో నింపడానికి ప్రయత్నిస్తున్న అమ్మ! సంగీత సాహిత్యాలు బోధించే కొమ్మ! విద్యాబుద్ధులు నేర్పించే పంతులమ్మ. వీరిద్దరినీ వీరవనితలుగా తీర్చిదిద్దాలన్నదే ఆమె ధ్యేయం! జీవితం ఎవ్వరికీ వడ్డించిన విస్తరి కాదు. జీవించడం లోని ఆటుపోట్లను గ్రహిస్తూ సాగిపోవడమే నదీప్రవాహంలా, మనిషి కర్తవ్యం! జీవితానికి ఆడామగా తేడాలుండకూడదు. ఆకలీ, నిద్రా సుఖమూ, దుఃఖమూ అన్ని అనుభూతులూ స్త్రీ పురుషులిద్దరికీ సమానమే అయినప్పుడు హెచ్చుతగ్గుల తేడాలెందుకు?

"జీవితం గంగ!
జీవించడం ప్రవాహం!!
ధైర్యం కవచం!" ఇవే ఉమ ఆ పిల్లలకి నేర్పే పాఠాలు.

లోపలనుంచి శరణ్య, లావణ్య మరో నలుగురు శిష్యురాళ్లూ గొంతెత్తి పాడుకున్నారు రాగయుక్తంగా.

'అయిగిరి నందిని నందిత మోదిని విశ్వవినోదిని నందినుతే
గిరివర వింధ్య శిరోధి నివాసిని విష్ణు విలాసిని జిష్ణునుతే
భగవతి హే శితి కంఠ కుటుంబిని భూరి కుటుంబిని భూరికృతే
జయజయహే మహిషాసుర మర్దిని రమ్యక పర్దిని శైలసుతే!!'

★

ఒకనాడు అమ్మా, అత్తా కూడా తనలాగే చిన్నవాళ్లే కదా. వాళ్లెందుకు కన్నారు పిల్లల్ని? వాళ్ల కోరికలు తీరిపోయాయిగా! అయినా ఈ రోజుల్లో పెద్దవాళ్లలో కూడా పిల్లల సంపాదనతో బతకొచ్చుననే స్వార్థం పెరిగిందా? ఒకప్పుడు ఆడపిల్ల ఇంట్లో కాఫీ తాగడం కూడా తప్పేననుకునేవారు. ఇప్పుడో? తన స్నేహితురాళ్లు రాజేశ్వరి, సుమన, వాళ్లు ఉద్యోగాలు చేసి సంపాదిస్తున్నా, ఇంట్లో వాళ్లు పెళ్లిమాట తలపెట్టక పోయేసరికి కారణం వాళ్లు చెప్పినప్పుడు తను నమ్మలేక పోయింది. అంతా వాళ్ల ఊహేనేమో? అట్లాంటి వాళ్లుంటారా? అనుకుంది తను.